క్లుప్తంగా

స్వచ్ఛభారత్

వైవీయూ : కడప నగరంలోని ఏపీఎస్ఆర్టీసీ డిపో కార్యాలయ ఆవరణంలో నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుబ్బనరసయ్య మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అంతకు మునుపు కళాశాలలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు గోపీ, విశ్రాంత ఏపీజీబీ మేనేజర్ శివశంకర్‌రెడ్డి ఓటరు చైతన్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న యూసఫ్ అనే వ్యక్తిని సీఐ సీ. భాస్కర్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి సోమవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 40 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

చిన్నచౌక్ పరిధిలో..

కడప నగర శివార్లలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైపాస్‌లో ఆర్బీ సమీపంలో వరదరాజులు అనే వ్యక్తి అక్రమంగా బీర్ బాటిళ్లను తరలిస్తుండగా సీఐ నరసింహారెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 19 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.


ధార్మిక చింతన పెంచేందుకు కృషి



వికర్ జనరల్ బాలరాజును సత్కరిస్తున్న మడగలం ప్రసాద్

కడప కల్చరల్ : ప్రజల్లో ధార్మిక చింతనను పెంచేందుకు కృషి చేస్తామని కడప కథోలిక మేత్రాసన వికర్ జనరల్ రెవరెండ్ ఫాదర్ బాలరాజు అన్నారు. మేత్రాసన నూతన వీజీగా నియమితులైన ఫాదర్ బాలరాజును సోమవారం పలువురు విశ్వాసులు, క్రైస్తవ ప్రముఖులు కలిసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీఎస్ఎస్ కార్యాలయంలో గౌరవ పూర్వకంగా ఆయనను శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ కలసి సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో శాంతి సేవా సొసైటీ కార్యదర్శి అయ్యూరి మునెయ్య, ఏలూరి ప్రభుదాస్ పాల్గొన్నారు.


పొలాలకు నిప్పు.. విద్యుత్‌కు అంతరాయం



కాలిపోయిన తీగలు

చెన్నూరు : మండలంలోని చినమాచుపల్లె గ్రామ పొలాలలో కొందరు ఆకతాయిలు అగ్గి పెట్టడం వల్ల మంటలు చెలరేగి 33 కేవీ లైన్ల కింద, అలాగే చుట్టుపక్కల వ్యాపించి విపరీతమైన ఉష్ణోగ్రత చెందడం వల్ల 33 కెవి ఇన్సులేటర్లు పగిలిపోవడం జరిగిందని ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం ఉదయం 10 గంటలకు చిన్నమాచుపల్లె పరిధిలోని పంట పొలాల్లో కొంత మంది ఆకతాయిలు అగ్గిపెట్టడంతో పంట పొలాల్లోని చుట్టుపక్కల మంటలు చెలరేగి అక్కడే ఉన్న 33 విద్యుత్ లైన్లకు, అలాగే విద్యుత్ తీగలకు మంటలు వ్యాపించడం వల్ల అదే విధంగా విపరీతమైన ఉష్ణోగ్రతల వల్ల 33 కెవి విద్యుత్ లైన్ల తీగలు సాగిపోయి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడిందని తెలిపారు. తమకు విషయం తెలియగానే సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసి కాలిపోయిన తీగలను సరి చేశామన్నారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

పోలీస్ అనుమతి తప్పనిసరి



ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి

కమలాపురం : మండలంలో ఎక్కడైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేయాలంటే పోలీస్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. కడప సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 30వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఎవరైనా సభలు, సమావేశాలు, నిరసనలు, ర్యాలీలు చేయాలంటే పోలీస్ స్టేషన్‌లో 24 గంటల ముందు లిఖిత పూర్వకంగా అర్జీ ఇచ్చి అనుమతి తీసుకోవాలని అన్నారు. అనుమతి తీసుకోకుండా ఇలాంటి కార్యక్రమాలు చేస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

‘ఆటిజం’ మహమ్మారిపై అప్రమత్తత అవసరం

నేడు ప్రపంచ ఆటిజం అవగాహన దినం

కడప అర్బన్ : సమాజాన్ని కలవరపెడుతున్న సమస్యల్లో ఆటిజం ఒకటి. ప్రపంచ వ్యాప్తంగా అనేకమంది పిల్లలు ఈ సమస్యతో సతమతమవుతున్నారు. చాపకిందనీరులా ప్రవహించి భావి పౌరుల జీవితాన్ని ప్రభావితం చేస్తున్న ఈ మహమ్మారి పట్ల అప్రమత్తత అవసరం.

■ ఆటిజం అంటే మెదడులో నాడీ వ్యవస్థలో లోపం వలన ఏర్పడే మానసిక స్థితి. ఈ ఆటిజం అనేది జీవితాంతం కనిపించే విభిన్నమైన మానసిక స్థితి. ఆటిజానికి గురైన వారిలో మెదడులోని సమాచారాన్ని క్రమబద్ధీకరించే వ్యవస్థ పనితీరు సరైన నియంత్రణ లేకపోవడం వలన, సామాజిక, భాషా నైపుణ్యాల ప్రదర్శనలో సాధారణ పిల్లల కన్నా వెనుకబడి వుంటారు.

■ ఆటిజం రావడానికి మెదడులో లోపాలుండటం, నాడీ వ్యవస్థ సరిగా ఎదగకపోవడం వలన తలెత్తే సమస్య. ఇలాంటి పిల్లలలో బుద్ధి మాంద్యంతో పాటు ఫిట్స్, ఇతరత్రా వ్యాధులు కూడా కనపడుతుంటాయి. మెదడు ఎదుగుదలకు తోడ్పడే కొన్ని జన్యువులు, క్రోమోజోములు కూడా ఆటిజంకు దోహదపడతాయి.

■ ఆటిజం పుట్టుకతో వచ్చే సమస్యే అయినా, కొంతమంది పిల్లల్లో మూడేళ్లదాకా గుర్తించలేకపోవచ్చు. పిల్లల్లో కనిపించే ఈ వ్యాధి లక్షణాల్లో ప్రధానంగా భావవ్యక్తీకరణ, ఏకాగ్రతా పరమైన విషయాల్లో ఇబ్బందులు ఎదుర్కోవడం ఎక్కువగా కనిపిస్తుంది. వీరిలో దాదాపు 40 శాతం మందికి అసలు మాటలే రాకపోవచ్చు. తోటి పిల్లలతో స్నేహం చేయలేకపోవడం, ఎదుటి వారి భావోద్వేగాలను అర్థం చేసుకోలేకపోవడం, ఎవరితోనూ తమ భావోద్వేగాలను పంచుకోలేకపోవడం, మనోభావాలు ఊహించని విధంగా వ్యక్త పరుస్తుంటారు.

■ ఆటిజం లక్షణాల ఆధారంగా ఒకే తీరులో, ఒకే తీవ్రతతో వుండదు. డాక్టర్స్.. ఆటిజం రేటింగ్ స్కేల్స్ ఆధారంగా పిల్లల ప్రవర్తన, లక్షణాలను గుర్తించి, అవసరమైన ఐక్యూ పరీక్షలు చేస్తారు.

సరైన సమయంలోనే వైద్యసేవలందించాలి..

ఆటిజం సమస్య అమ్మాయిలకంటే అబ్బాయిల్లో ఎక్కువగా కనిపిస్తోంది. ఈ సమస్య వున్న చిన్నారులలో ప్రవర్తనా లోపాలను సరిదిద్ది, దాదాపు సాధరణా స్థితికి తెచ్చేందుకు అవసరమైన శిక్షణను కొన్ని స్వచ్ఛంద సంస్థలు థెరపిస్ట్, సైకాలజిస్ట్‌లు అందిస్తున్నారు. వారి సేవలను ఉపయోగించుకోవాలి.

– డాక్టర్ కె. రత్నమ్మ, చైల్డ్ సైకాలజిస్ట్, జిల్లా సత్వర ఉపశమన విభాగం, రిమ్స్



కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. యానాదయ్య ఆధ్వర్యంలో ‘జగనన్నకు తోడుగా మేమంతా సిద్ధం’ కరపత్రాలను సోమవారం చలమారెడ్డిపల్లెలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంపీ రామచంద్రారెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు అడిగినవన్నీ ఇచ్చిన జగనన్నకు తోడుగా తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ దేశంలో ఎక్కడా లేని విధంగా నాయీ బ్రాహ్మణులను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయ పరంగా అత్యున్నత అవకాశాలు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతుగా నాయీ బ్రాహ్మణులంతా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. గుర్రప్ప, రాష్ట్ర కార్యదర్శి జి. క్రిష్ణయ్య, జిల్లా యువజన అధ్యక్షుడు కె. బాబు, రామక్రిష్ణ, వివి రత్నం, ఏ. ప్రసాద్, నిత్య పూజ, కె రమణ, పెంచల నరసింహులు పాల్గొన్నారు.

ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్



కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కడప అర్బన్ : ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి సోమవారం కడప నగరంలోని వన్‌టౌన్ పరిధిలోని పలు ప్రాంతాలలో పోలీసులు కవాతు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ ఆధ్వర్యంలో కందిపాలెం, ఎర్రముక్కపల్లి, హౌసింగ్ బోర్డ్ కాలనీ, రాజీవ్ మార్గ్ ప్రధాన రహదారుల మీదుగా ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. ఈ సందర్భంగా కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు ప్రజలలో భరోసా కల్పించేందుకు కవాతును నిర్వహించారన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కడప వన్‌టౌన్ సీఐ సి. భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ రంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా రంగం అభివృద్ధికి సదుపాయాలు

పులివెందుల రూరల్ : పులివెందుల జేఎన్టీయూ కళాశాలలో క్రీడారంగం అభివృద్ధికి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు అనంతపురం జేఎన్టీయూ వైస్ చాన్స్‌లర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పులివెందుల జేఎన్టీయూ కళాశాలలో క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలపై ప్రోత్సాహం పెంపొందించే విధంగా అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. విద్య, ఆరోగ్యం, వృత్తిపై దృష్టి సారించి లక్ష్యాన్ని చేరుకోవడానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలు చేరేందుకు చదువుతో పాటు ఆట, పాటలు కూడా ఉపయోగపడుతాయన్నారు. ప్రతి మనిషిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందన్నారు. ఆ ప్రతిభకు కృషి తోడైతే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. అనుకున్న లక్ష్యాలను నెరవేర్చేందుకు క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి మాట్లాడుతూ క్రీడల ద్వారా పట్టుదల, కార్యసిద్ధి మెరుగుపడి ఒత్తిడిని జయించవచ్చన్నారు. ఎందరో క్రీడాకారులు సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, సాంకేతిక సహకారం లేని రోజుల్లో దేశప్రతిష్టను నిలబెట్టారన్నారు. అటువంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు.



సమావేశంలో పాల్గొన్న వీసీ శ్రీనివాసరావు

మనిషికి దైవమిచ్చిన వరం ‘రోజా’

హజరత్ సయ్యద్‌షా అహ్మద్‌పీర్ షహమీరి

కడప కల్చరల్ : ఈ లోకాన్ని సృష్టించిన దేవుడు.. మనిషి నియంత్రణ కోల్పోయే ప్రమాదం నుంచి రక్షించాలని ప్రతి సంవత్సరం ప్రత్యేకించి ఒక నెల పాటు మనిషిని సంస్కరించేందుకు రంజాన్ మాసాన్ని సృష్టించి కఠిన పరీక్ష పెడతారు. నిజానికి అది పేరుకు మాత్రమే పరీక్ష, కానీ ఫలితం మాత్రం మానవుడికి దేవుడిచ్చిన వరమేనని చెప్పవచ్చని కడప నగరానికి చెందిన ఖాన్‌ఖాయే షహమీరియా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా అహ్మద్‌పీర్ షహమీరి సాహెబ్ పేర్కొంటున్నారు. రంజాన్ మాసం కొనసాగుతున్న సందర్భంగా ఆయన ఈ మాసంలో ప్రముఖమైనదిగా భావించే రోజా (ఉపవాసం) గురించి వివరించారు.

ఆరోగ్యవంతులైన ప్రతి ముస్లిం పవిత్ర రంజాన్ మాసంలో రోజా విధిగా ఆచరించాలి. దేవుడు ఈ లోకానికి మార్గదర్శనం చేస్తూ అందించిన దివ్య ఖురాన్‌లో మనిషి మహోన్నతుడిగా మారేందుకు ఎన్నో విధానాలు సూచించారు. రోజా అందులో ప్రముఖమైనది, పవిత్రమైనది. సంవత్సరంలో కనీసం ఒక నెల విధిగా ఉపవాస దీక్షలు పాటించాలని దైవం ఆజ్ఞాపించారు. ఈ ఉపవాస దీక్షలు పలు పేర్లతో ఇతర మతాలలో కూడా నిర్వహిస్తారు. దీన్నే పర్షియన్ భాషలో రోజా అంటారు.

ధర్మ మార్గంలో..

రోజా ద్వారా మనిషికి ఎంతో మేలు కలుగుతుంది. మనిషి చెడు మార్గంలో వెళ్లడాన్ని నిరోధిస్తుంది. కనీసం కళ్లతోగానీ, నోటితోగానీ, చేతులు, కాళ్లతోగానీ చెడు మార్గం పట్టకూడదని రోజా నియమాలు బోధిస్తాయి. భౌతిక పరమైన ఆకర్షణ లేగాక కనీసం మానసికంగా కూడా తప్పుడు ఆలోచన చేయకూడదన్న నియమం ఉంది. మనిషి ఈ మాసమంతా తనకు అత్యవసరమైన ఆహార పానీయాలు వదిలి కనీసం ఉమ్మి కూడా మింగకుండా పరమ నిష్ఠతో ఉంటాడు. నిరంతరం దైవ ప్రార్థనలో ఉంటూ ప్రాపంచిక విషయాలకు దూరంగా ఉంటాడు.

ఆరోగ్యపరంగా..

రోజాల వల్ల మనిషికి శరీరంతోపాటు మనసుపై కూడా అదుపు లభిస్తుంది. ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉండడం, అనంతరం ఉపవాస దీక్ష విరమించడం, ఆ తర్వాత మళ్లీ భోజనం స్వీకరించడం, చెడు ఆలోచనలను దరి చేరనీయకపోవడం, అటు శారీరకంగా, ఇటు మానసికంగా మనిషిని అదుపులో ఉంచుతాయి. ఉపవాస సంకల్పంతో ఉషోదయానికి ముందు తీసుకునే ఆహారాన్ని సెహరి అంటారు. కడుపునింపే స్థాయి ఆహారం లభించకపోయినా కనీసం మంచినీళ్లు తాగి అయినా సెహరి నియమాన్ని పాటించడం మంచిది. సూర్యాస్తమయం తర్వాత వెంటనే ఉపవాస దీక్ష విరమించడాన్ని ఇఫ్తార్ అంటారు. ఈ కార్యక్రమం ప్రారంభంలోనే నియమాన్ని పాటించడం పుణ్యదాయకం. మొత్తంపై రోజా ద్వారా మనిషికి శాంతి, తృప్తి, నిలకడ, గౌరవం లభిస్తుంది. ఈ లోకంలో ఆనంద భరితమైన జీవితం, పరలోకంలో మోక్ష ఫలితాలను ఆస్వాదించేందుకు దైవం ఈ నియమాల ద్వారా సన్మార్గాన్ని ప్రసాదించారు.

రంజాన్‌లో తాఖ్ రాత్రులు అత్యంత పవిత్రం

ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు

కడప కల్చరల్ : పవిత్ర రంజాన్ మాసంలో అత్యంత ముఖ్యమైనవిగా, అధిక పుణ్యాన్ని ఇచ్చే తాఖ్ రాత్‌లు ప్రారంభమయ్యాయి. ఇందుకు కడప నగరంలోని పలు మసీదులలో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా మొదటితాఖ్ రాత్ సందర్భంగా దాదాపు అన్ని మసీదుల్లోనూ, ఇళ్లలో సైతం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోమవారం రాత్రి 11.30 గంటలకు ప్రారంభమైన ఈ ప్రార్థనలు తెల్లవారు సెహరీ వరకు కొనసాగాయి. ఈ సందర్భంగా కొందరు మత గురువులు అల్లాహ్ సందేశాన్ని అందజేశారు. అలాగే పవిత్ర రంజాన్ మాసం విశిష్టత, మహా ప్రవక్త గుణగణాలను తెలియజేశారు. మహా ప్రవక్త మహమ్మద్ (సొ.అ.వ) సూచనలు, మానవుడు అనుసరించాల్సిన విధానాన్ని వివరించారు. వీటితోపాటు పవిత్ర ఖురాన్ పఠనంతోపాటు సామూహికంగా జిక్ర్‌ను చేయించారు. అర్ధరాత్రి 2.00 గంటల తర్వాత తహజూద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పాపాలను క్షమించాలని ఏకేశ్వరుడైన అల్లాహ్‌ను మనసారా ప్రార్థించారు. అనంతరం హాజరైన భక్తులకు ఆయా మసీదుల నిర్వాహకులు ఆ ప్రాంగణంలోనే సెహరి సౌకర్యం కల్పించారు. ఇదిలా ఉండగా ఈ తాఖ్‌రాత్‌లను ఈనెల 2, 4, 6, 8 తేదీల్లో నిర్వహించనున్నారు. ఆయా రోజుల్లో కూడా ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన ఆధ్యాత్మిక వేత్తలు, ఇతర ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయి.

వైభవంగా జ్యోతి ఉత్సవాలు



జ్యోతులతో భక్తుల ఊరేగింపు

కడప కల్చరల్ : ఎర్రముక్కపల్లిలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయం వద్ద నుంచి భక్తులు ఊరేగింపుగా బిందు సేవకు తరలివచ్చారు. పూసల వీధిలోని బోరు వద్ద నుంచి నీటి బిందెలతో భక్తులు ఆలయానికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు కల్యా సుధాకర్ అమ్మవారి ఉత్సవాల జ్యోతిని వెలిగించారు. మరో జ్యోతిని కొరముట్ల సుబ్బరాయుడు వెలిగించారు. మొత్తం 16 జ్యోతులతో మేళ తాళాల మధ్య బాణాసంచా సందడితో స్థానిక వీధుల్లో ఊరేగింపు భక్తజనరంజకంగా సాగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు, తొగటవీర క్షత్రియ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అవ్వాతాతల గోడు తగలక తప్పదు

● టీడీపీ అధినేత చంద్రబాబుపై ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజం



పింఛన్ల పంపిణీపై వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలోని అవ్వా తాతలు, వికలాంగులు, వితంతువుల గోడు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు తగలక తప్పదని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఉరుటూరు గ్రామంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటును వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని వారికి సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువుల కష్టాలు తెలుసుకొన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్‌ల ద్వారా ప్రతి నెల 1వ తేదీ ఉదయం సూర్యుడు ఉదయించక ముందే తలుపు తట్టి పింఛన్ పంపిణీ నిర్వహించడం జరిగేదని తెలిపారు. వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆపేయాలని చంద్రబాబునాయుడు మద్దతుదారులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. దీంతో వలంటీర్‌ల ద్వారా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆపేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని తెలియజేశారు. అంతే కాకుండా వలంటీర్ల వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకోవాలని, ప్రభుత్వ అధికారులు మాత్రమే పింఛన్ పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. అవ్వాతాతలకు మూడు నెలలు కష్టాలు తప్పవని తెలిపారు. సంక్షేమ పథకాల పంపిణీకి అడ్డుకట్ట వేసిన చంద్రబాబుకు లబ్ధిదారులు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజల బాగోగుల గురించి ఆలోచించే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకొనేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. ప్రచారం నిర్వహించేందుకు గ్రామాల్లోకి వెళ్తున్న సమయంలో బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ చంద్రఓబుల్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీ రామాంజనమ్మ, స్థానిక నాయకులు గంగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గంగిరెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

పెండ్లిమర్రి : పవిత్ర రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం కొండూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు షబ్బీర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విందులో పాల్గొన్నారు. ఈమాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఎంతో పుణ్య కార్యమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాతకు అండగా నిలుద్దాం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నరేన్ రామాంజుల రెడ్డి

చెన్నూరు : నవరత్నాల రూపకర్త, సంక్షేమ, అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కమలాపురం శాసనసభ్యులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి తనయుడు చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజుల రెడ్డి అన్నారు. సోమవారం మండల వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఉప్పరపల్లె గ్రామపంచాయతీలోని నరసారెడ్డిపల్లె, దుగ్గనపల్లె గ్రామాలలో వైస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ఇంటింటికి వెళ్లి ఆ ఇంటికి జరిగిన మేలును వచ్చిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలని, వైఎస్సార్‌సీపీకి ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి కమలాపురం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపారన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ ఏ సమస్య ఉన్నా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళితే వెంటనే స్పందించి పరిష్కరించారన్నారు. ఆయనను మండల ప్రజలు ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో మూడవసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, గాజులపల్లె సంపూర్ణరెడ్డి, ఎర్రసాని రాజగోపాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, కొండారెడ్డి, ఓబులరెడ్డి, పుల్లారెడ్డి, రమణారెడ్డి, వీరారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, నాగ సుబ్బారెడ్డి, సాయిరెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రఘు, నాగేంద్రరెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఆర్ వీఎస్ఆర్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, జేసీఎస్ టౌన్ కన్వీనర్ శ్రీనివాసరాజు, గుమ్మల మధుసూదన్ రెడ్డి, మెడికల్ రవి, సొసైటీ అధ్యక్షులు అల్లి శ్రీరామమూర్తి, వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి గుమ్మల్ల సాయికుమార్‌రెడ్డి, నాయకులు సత్యరాజు, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, నిత్య పూజయ్య, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

దువ్వూరు: మండలంలోని దువ్వూరు, సంజీవరెడ్డిపల్లె, పుల్లారెడ్డిపేట, గోపులాపురం, అన్నపుశాస్త్రులపల్లె, సంగటి తిమ్మాయపల్లె గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం తహసీల్దార్ ఉమారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ర్యాంప్‌లు, టాయిలెట్లు తదితర మౌలిక సదుపాయాలపై ఆరా తీసి సిబ్బందికి సూచలిచ్చారు. అనంతరం ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాను పరిశీలించి, ఓటు హక్కు లేని వారు ఎవరైనా ఉంటే నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జాన్సన్, డిప్యూటీ తహసీల్దార్ అలీఖాన్, ఈఓపీఆర్డీ శివప్రసాద్, వీఆర్ఓలు రమణారెడ్డి, ఖాలీద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీత పఠనం.. మోక్ష ప్రదాయం



సైకిల్ యాత్ర చేస్తున్న నితిన్

ప్రొద్దుటూరు కల్చరల్: భగవద్గీత పఠనం మోక్ష ప్రదాయమని విద్యార్థి చింతలపూడి నితిన్ అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థి చింతలపూడి నితిన్ తిరుమల నుంచి విజయనగరానికి సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఆయన సోమవారం ప్రొద్దుటూరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాలపై ఆసక్తి ఉన్న యువతను పరిచయం చేసుకుంటూ యోగా, భగవద్గీత పఠనం వారి దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచిస్తున్నట్లు తెలిపారు. విజయనగరంలోని రామనారాయణ మందిరం దర్శనంతో యాత్ర ముగుస్తుందని తెలిపారు.